



మరిపెడ మండలం నీట మునిగిన సీతారాంతండాలో కావడి కట్టి వృద్ధురాలిని ఎత్తుకుపోతున్న సీరోలు ఎస్సై నగేష్(ఫైల్)

2024 కాలచక్రం

రోడ్డు ప్రమాదాలు.. ఆత్మహత్యలు

- విషాదాలు మిగిల్చిన 2024
- పలు ఘటనల్లో అనేకమంది మృత్యువాత
- అన్నదాతల ఉసురు తీసిన అప్పులు



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు–వలిగొండ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జాటోతు శాంతమ్మ, జాటోతు వెంకన్న (ఫైల్)

మహబూబాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : 2024.. జిల్లా లో రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలతో విషాదాలను మిగిల్చింది. రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాతపడ్డారు. ఓ వైపు శుభకార్యాలకు.. వివిధ పనుల నిమిత్తం, బంధువుల కర్మకాండల కు ద్విచక్రవాహనాలపై వెళ్లిన వారు తిరిగి వస్తున్న క్రమంలో పలువురు రోడ్డు ప్రమాదాల్లో కన్నుమూయడంతో ఆయా కుటుంబాల్లో విషాదమే మిగిలింది. మరోవైపు అందరికీ అన్నంపెట్టే అన్నదా తల్లో కొందరు పెట్టుబడుల కోసం అప్పులు చేసి సాగు చేసినప్పటికీ పంట దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలని ఆవేదనకు గురై ఆత్మహత్య లు చేసుకున్నారు. ఇంకో వైపు సెప్టెంబరులో కురిసిన అకాల వర్షాలు మానుకోట జిల్లాను అతలాకుతలం చేయగా.. పంటలు, ఆస్తులు, ప్రాణాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద బ్రిడ్జి కొట్టుకుపోగా, చిన్నగూడూరు సమీపం లోని బ్రిడ్జి సైతం కోతకు గురైం ది. మరిపెడ మండలం పురుషోత్తమయగూ డెం వద్ద బ్రిడ్జి తెగిపోవడంతో అందులో నుంచి కారులో వెళ్తున్న తండ్రి కూతుళ్ల కొట్టుకుపోయి విగతజీ వులుగా మారారు. వీటితో పాటు పలు హత్య లు కూడా పోలీసులకు సవాల్ విసిరాయి. మొత్తానికి 2024 జిల్లాలో పలు సంచలన నేరాలకు వేదికైంది.

- మరిపెడ మండలం సీతారాంతండా నీట మునగగా సీరోలు ఎస్సై నగేష్ నేతృత్వంలో 100 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అంతేకాకుండా 60 ఏళ్ల వృద్ధురాలికి కావడి కట్టి సురక్షిత ప్రాంతానికి తరలించారు.
- జూలై 24న మరిపెడ మండ లం దుబ్బతండాలో బామ్మర్దిని కత్తిపొడిచి చంపిన బావ, ఆగస్టు 31న రాత్రి కురిసిన భారీ వర్షంతో ఉల్లేపల్లి, బీచరాజుపల్లి, సీతారాంతండా జలది గ్బంధంలో చిక్కుకున్నాయి. అదేరోజు రాత్రి ఖమ్మం జిల్లా కారేపల్లి తండాకు చెందిన తండ్రి, కుమార్తె ఆకేరు వరదప్రవాహంలో కారుతో సహా కొట్టుకుపోయి మృతి చెందారు. నవంబరులో గుండెపుడిలో వరికోత యం త్రం కింద పడి డ్రైవర్ మృతి చెందాడు. డిసెంబర్‌లో పురుషోత్త మగూడెం సమీపంలో 60 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.
- మార్చి 23న కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలో కార్తీక్ అనే దళిత యువకుడిపై దాడి చేసిన 11 మందిపై అట్రాసిటీ కేసు నమోదైంది. ఆగస్టు 18న గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవో బిక్షమాచారిపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి కేసు నమోదు చేశారు.
- జూన్ 7న కేసముద్రం మండలం పెనుగొండ క్రాస్‌రోడ్డు సమీపంలో లారీ ఢీకొని బైక్‌పై వెళుతున్న సబ్‌స్టేషన్‌తండా మాజీ సర్పంచ్ గుగులోత్ వెంకన్న, గుగులోత్ వీరన్న మృతి చెందారు. జులై 14న కేసముద్రం విలేజి బ్రాందీషాపు సమీపంలో వ్యక్తిగత కక్షలతో జిలుకర నాగరాజు హత్య సంచలనం రేపింది. అక్టోబర్ 11న కేసముద్రం మండలం పెనుగొండలో ఆంధ్రప్రదేశ్‌లోని కడప పట్టణానికి చెందిన లక్కే ప్రశాంత్(30)ను ఆయన భార్య, అత్త, బావమరిది కలిసి తాడుతో ఉరి వేసి చంపి, ఆపై మార్మాంగాన్ని వేడి గరిటతో కాల్చడం సంచలనం రేపింది. డిసెంబర్ 1న కేసముద్రం

మిగతా 8వ పేజీలో...

పంచాయతీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి

- కలెక్టరేట్ ఎదుట జీపీ ఉద్యోగుల ఆందోళన



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామ పంచాయతీ ఉద్యోగులు

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్‌తో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీఐటీయూ అనుబంధ గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం జీపీ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి బండ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచాలని, జీవో నెంబరు 51ను సవరించాలని, మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పెండింగ్ వేతనాల చెల్లింపుల జాప్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే అనేక రూపాల్లో ఉద్యమాలు చేసి టోకెన్ సమ్మెకు దిగామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో జనవరి 4 తర్వాత ఎప్పుడైనా నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం డీఎల్పీవో కనకదుర్గకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్డీ. మొహినుద్దీన్, బొల్లం ఎల్లయ్య, ఉపేంద్రాచారి, నాగేశ్వర్‌రావు, లతీఫ్, అశోక్, దస్తగిరి, దాసు, కనకలక్ష్మి, యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్ వెండర్ దుకాణాల నిర్మాణం కోసం అనుమతి ఇవ్వాలి



కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్, బీఆర్ఎస్‌కౌన్సిలర్లు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణంలో ఉన్న క్లబ్ నిజాం కాలం నుంచి ఆఫీసర్స్ క్లబ్‌గా నామకరణంగా ఉందని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న అన్నారు. ఓసీ క్లబ్, కోఆపరేటివ్ స్థలంగా పిలవబడుతున్న మునిసిపాలిటీ స్థలంలో స్ట్రీట్‌వెండర్‌ల దుకాణాల నిర్మాణం కోసం అనుమతి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలోని ఓసీ క్లబ్‌కు అప్పట్లో ఆర్డీవో చైర్మన్‌గా క్లబ్ కమిటీని ఎన్నుకుంటూ వస్తోందని, కాల క్రమేనా అది శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని సీజ్ చేయడం జరిగిందన్నారు. 2021లో మహబూబాబాద్ పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్ నిర్మాణంలో భాగంగా స్థలం కోసం మునిసిపల్ కౌన్సిల్‌సభ్యులు, అధికారులు అప్పట్లో కలెక్టర్‌ను కోరగా క్లబ్ స్థలం 1.03 ఎకరాలు, వ్యవసాయ గిడ్డంగుల స్థలం 0.26 గుంటలు, పాత కూరగాయల మార్కెట్ స్థలం 0.32 గుంటలు మొత్తంగా రూ.2.21 ఎకరాల భూమిని మునిసిపాలిటీకి అప్పగించడం జరిగిందన్నారు. అందులో మార్కెట్ నిర్మాణ ప్లాన్‌ను డీటీసీపీ ఆమోదం కోసం పంపించడం జరిగిందని, వారు తూర్పు కొంత, పడమర కొంత స్థలాన్ని పార్కింగ్ కోసం చూపించడం జరిగిందన్నారు. అదే విధంగా తహసీల్దార్ కార్యాలయం ముందు మజీద్‌పక్కనే ఉన్న కోఆపరేటివ్ స్థలంగా పిలవబడుతున్న స్థలం కూడ మునిసిపాలిటీ స్థలమని, అందులో ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్ నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆ స్థలాన్ని మునిసిపాలిటీకి అప్పగించి స్ట్రీట్ వెండర్ దుకాణాల నిర్మాణం కోసం అనుమతి ఇస్తే నిర్మాణం చేపట్టి రోడ్లపై అమ్ముకునే చిరు వ్యాపారులకు కేటాయిస్తే మునిసిపాలిటీకి ఆదాయం రావడంతో పాటు స్థలం అన్యాక్రాంతం కాకుండ ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి అనుమతి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణు, కర్పూరపు గోపి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఏపీజీవీబీ విలీనం

తొర్రూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఆర్థిక శాఖ ఉత్తర్వుల మేరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ)ని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ)లో విలీనం చేస్తున్న నేపథ్యంలో శనివారం నుంచి బ్యాంకు సేవలు నిలిచిపోయినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. 2006 మార్చి 31న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వరంగల్ జిల్లా ప్రధాన కేంద్రంగా ఏపీజీవీబీని ఏర్పాటు చేశారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పటికీ రెండు రాష్ట్రాలకు ప్రధాన కార్యాలయం వరంగల్‌లోనే కొనసాగుతోంది. తెలంగాణాలో మొత్తం 493 బ్యాంకు శాఖలు ఉన్నాయని, విలీనం సందర్భంగా ఈ నెల 28 నుంచి 31 వరకు టీజీబీలో ఆన్‌లైన్, మొబైల్, ఇంటర్నెట్, యూపీఐ, ఏటీఎం బ్యాంకింగ్ సేవలు, ఖాతాదారుల సేవలు అందుబాటులో ఉండవని ఈ మేరకు టీజీబీ బ్రాంచిల్లో వినియోగదారులకు సమాచారం కోసం ప్రత్యేకంగా నోటీసు బోర్డులపై నోటీసులు అంటించారు. ఖాతాదారుల సెల్‌ఫోన్‌లకు వాట్సాప్ మెసేజ్‌లు పంపుతూ సామాజిక మాధ్యమాల్లో తెలియజేశారు. అత్యవసరం ఉంటే ఈ నెల 30, 31వ తేదీల్లో ఖాతాదారులు రూ.5వేల వరకు డ్రా చేసుకునే అవకాశం ఉంటుందని, వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ వరకు ఖాతాదారులకు టీజీబీ సేవలు అందుబాటులోకి వస్తాయని బ్యాంకు ఉన్నతాధికారులు తెలిపారు.

మానుకోట డీడీగా దేశీరాంనాయక్



దేశీరాం నాయక్

నెహ్రూసెంటర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) గుగులోతు దేశీరాం నాయక్‌ను నియమిస్తూ ట్రైబల్ వెల్ఫేర్ రాష్ట్ర కమిషనర్ డాక్టర్ ఎ.శరత్ ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మాలోత్ సైదా నాయక్‌ను హైదరాబాద్ సీటీడబ్ల్యూకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ములుగు ఏటీడీవోగా విధులు నిర్వహిస్తున్న గుగులోతు దేశీరాంనాయక్‌ను మహబూబాబాద్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు. ఈ మేరకు ఆయన మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

బాధ్యతగా పనిచేయాలి: ఎస్పీ



జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేథన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హెడ్‌కానిస్టేబుళ్లు

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పదోన్నతితో ఉద్యోగం పట్ల మరింత బాధ్యత పెరుగుతుందని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో వరంగల్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు పదోన్నతిపై హెడ్‌కానిస్టేబుళ్లుగా మహబూబాబాద్ జిల్లాకు వచ్చారు. శనివారం జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. . పదోన్నతులు పొందిన వారిలో సీహెచ్.రాజేష్, అశోక్,రవీందర్, సోమేశ్వర్, సురేష్, సదయ్య అశోక్, ప్రవీణ్, నర్సయ్య, దామోదర్ తదితరులు ఉన్నారు.







రాతి చిత్రాలను చూపిస్తున్న పరిశోధన బృందం

బంధాల గుట్టల్లో రాతి చిత్రాల గుర్తింపు

మేడారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం బంధాల గ్రామం దామర్ల గుట్టపై మధ్య శిలా యుగం నాటి రాతి చిత్రాలను గుర్తించామని సమ్మక్క- సారలమ్మ ఆర్కియాలజీ, ఇండిజినస్ పరిధనా కేంద్రం డైరెక్టర్ కొర్నిబెల్లి గణేష్ తెలిపారు. మేడారం ఆదివాసీ మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ కురుసం రవి బృందంతో కలిసి శనివారం పరిశీలించినట్లుగా తెలిపారు. పూర్వ కోయ, ఆదివాసీలు వేసిన లిపిగా నిర్ధానించామన్నారు. ఈ గుట్టలో మూడు ప్రాంతాల్లో రాక్ షెల్టర్లను గుర్తించినట్లు చెప్పారు. ఇందులో మొదటి షెల్టర్‌లో 12 చిత్రాలను గుర్తించామన్నారు. ఈ చిత్రాలు రాతి 20 మీటర్ల పొడవు, 15 మీటర్ల నిలువు, ఎత్తు ఉందన్నారు. ఈ చిత్రాల్లో కోయ సంప్రదాయలకు చెందిన ఐదో గొట్టు, నుదటి బొట్టు త్రిశూలం గుర్తు 18 దిక్కులా సింబల్ గొట్లను తెలియజేసే చేతి గుర్తులు ఉన్నాయన్నారు.

ముదురు ఎరుపు రంగులో చిత్రాలు

రెండో షెల్టర్‌లో ఐదు తలల నాగుపాము పడిగ చిత్రాలు ఉన్నాయన్నారు. మూడో షెల్టర్ 16 మీటర్ల పొడవు, 6 మీటర్ల ఎత్తు కలిగి ఉందన్నారు. ఇందులో మూడో గొట్టు చిత్రాలు, అడమరాజు కళ్లకు గంతలు కట్టుకొని కాకిని కొట్టిన బొమ్మలు, బానం బొమ్మ, ఆదివాసీలు పూర్వం నూనెను తయారు చేయడానికి ఉపయోగించిన గానుగ మొద్దు సింబల్, ఒక తల్లికి నలుగురు పిల్లలను తెలియజేసే చిత్రాలను గుర్తించామన్నారు.

ఈ చిత్రాలు ముదురు ఎరుపు రంగులో ఇసుక రాయి గుణం కలిగిన బండలపై వేసి ఉన్నాయ న్నారు. ఆయన వెంట పరిశోధన బృందం సభ్యులు, పురావస్తు శాస్త్రం, భాష శాస్త్రం విద్యార్థులు నవ్య, ధనలక్ష్మి, ధరని, స్వాతి, సమీరా, నవదీపిక, అర్జున్, ఆశోక్, రవి తదితరులు ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

వివరాలు వెల్లడించిన డీసీపీ రాజ మహేంద్రనాయక్

పాలకుర్తి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పాలకుర్తిలో పది రోజుల క్రితం జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. శనివారం పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ రాజమహేంద్రనాయక్ వివరాలు వెల్లడించారు. డీసీపీ కథనం ప్రకారం మండల కేంద్రంలో ఈనెల 18న రాత్రి చారగొండ్ల మల్లయ్య కాలనీలో నివాసం ఉండే బోడ లలిత ఇంట్లో చోరీ జరిగింది. బాధితురాలి ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి గుర్తు తెలియని వ్యక్తి బంగారం, వెండి నగలు, నగదును అపహరించారు.

లలిత ఫిర్యాదుతో వావిలాలకు చెందిన కరణం సాయికుమార్ ఈ చోరీకి పాల్పడినట్లు నిర్ధారించారు. శనివారం బస్టాండ్ సమీపంలోని పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 13 తులాల బంగారం, 40 తులాల వెండి రూ. 4.60 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. పలు చోరీ కేసుల్లో నిందితుడిపై గతంలో లింగాలఘన్‌పురం, రాయపర్తి, జవహర్ నగర్‌కేసర, మేడిపల్లి పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు కాగా 8 నెలలు జైలు జీవితం గడిపాడు. ఏసీపీ అంబటి నర్సయ్య, ఆధ్వర్యంలో విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడుని సకాలంలో గుర్తించి అపహరణకు గురైన నగలు, నగదు, స్వాధీనం చేసుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీసీపీ నాయక్, చిత్రంలో ఏసీపీ, సీఐ

నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ మహేందర్‌రెడ్డి, పాలకుర్తి ఎస్సై పవన్‌కుమార్‌ను డీసీపీ రాజమహేంద్ర నాయక్ అభినందించారు.

మహిళా సంఘంలో రూ.5 లక్షలు స్వాహా

బ్యాంకులో జమ చేయకుండా వాడుకున్న వీవోఏ

కేసముద్రం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోరుకొండపల్లిలో మహిళా స్వయం సహాయక సంఘంలో రూ.5లక్షలు స్వాహా అయ్యాయి. ఐకేపీ సీసీ పిల్లి శ్రీనివాస్ తెలిపిన ప్రకారం..గ్రామానికి చెందిన స్నేహ సంఘం సభ్యులు బ్యాంకు నుంచి 2023, జనవరిలో రూ.10 లక్షలు రుణం తీసుకున్నారు. ఈ రుణానికి నెలకు రూ.35వేల ఈఎంఐ, రూ.1వెయ్యి పొదుపు వెరసి రూ.36వేలు బ్యాంకులో చెల్లించాల్సిఉంటుంది. కొద్దినెలలపాటు సంఘం లీడర్లు బ్యాంకుకు వెళ్లి ఈఎంఐలను చెల్లించారు. ఆ తర్వాత ఆ సంఘం సభ్యులు డబ్బులను బ్యాంకులో చెల్లించమని కోరుతూ గ్రామానికి చెందిన గ్రామైక్య సంఘం సహాయకురాలు (వీవోఏ) షైబాబకు ఇస్తూ వచ్చారు. కొద్దిరోజుల క్రితం సంఘం లీడర్లు తమ ఈఎంఐ చెల్లించేందుకు బ్యాంకుకు వెళ్లగా 14 నెలలుగా డబ్బులు చెల్లించడంలేదని బ్యాంకువారు తెలుపడంతో ఖంగుతిన్నారు. వెంటనే ఐకేపీ అధికారులకు ఫిర్యాదు చేయగా గ్రామంలో శనివారం విచారణ జరిపి పలు దఫాలుగా వీవోఏకు ఇచ్చిన రూ.5,00,400లను వాడుకున్నట్లు నిర్ధారించారు.

ఈ మేరకు తీర్మానించగా రెండు నెలల్లో చెల్లిస్తానని వీవోఏ ఒప్పుకున్నట్లు సీసీ తెలిపారు. వీవోఏపై చర్యలు తీసుకునేందుకు ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు సీసీ తెలిపారు. మహిళా సంఘాల సభ్యులెవరూ తమ వాయిదా డబ్బులను వీవోఏలకు ఇవ్వవద్దని, నేరుగా బ్యాంకులో చెల్లించాలని సూచించారు.

రఘునాథపల్లి ఎస్ఐకి జైలు



ఎస్ఐ నరేష్

రఘునాథపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రఘునాథపల్లి ఎస్ఐగా పని చేస్తున్న డి.నరేష్‌కు వారం రోజుల జైలు శిక్షతోపాటు రూ.50వేల జరిమానా విధిస్తూ శుక్రవారం హైకోర్టు తీర్పు వెలువరించింది. తరిగొప్పుల ఎస్ఐగా నరేష్ పని చేస్తున్నప్పుడు కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా ఓ వ్యక్తిని అరెస్టు చేశాడు. ధాన్యం అమ్మకాల విషయంలో తరిగొప్పుల పోలీస్ స్టేషన్‌లో గొలుసు నర్సయ్యపై 11ఫిబ్రవరి 2023న కేసు నమోదైంది. దీంతో నర్సయ్య హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారించిన హైకోర్టు, సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు జారీ చేసి చట్టప్రకారం దర్యాప్తు చేయాలని ఎస్ఐని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ నోటీసులు జారీ చేసిన ఆరు రోజుల తర్వాత 17 ఫిబ్రవరి 2913న నర్సయ్యను ఎస్ఐ నరేష్ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాడు.

దీంతో నర్సయ్య దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై జస్టిస్ కే. సురేందర్ విచారణ చేపట్టి ఎస్ఐ డి.నరేష్‌కు వారం రోజుల జైలు శిక్షతో పాటు బాధితుడికి పరిహారం కింద రూ.50వేలు చెల్లించాలని ఆదేశిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. హైకోర్టు జారీ చేసిన నోటీస్ ఎస్ఐ నరేష్‌కు అందలేదని, నోటీసును నర్సయ్య సైతం ఎస్ఐ దృష్టికి తీసుక రాకపోవడం వల్లనే అరెస్టు చేసినట్లు తెలుస్తుంది. రఘునాథపల్లి ఎస్ఐ డి.నరేష్‌కు హైకోర్టు జైలు శిక్షతోపాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిన విషయం దావానంలా వ్యాపించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

ఉపాధి కోసం వెళ్లి.. ఊపిరి పోయి..

- హైదరాబాద్‌లో కారు ఢీకొని వాచ్‌మన్ మృతి
- మృతుడు కేసముద్రం మండల వాసి



ప్రమాదంలో మృతి చెందిన గణేష్

కేసముద్రం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవనోపాధి కోసం పొట్టచేతపట్టుకొని హైదరాబాద్‌కు వెళ్లి నైట్‌వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గిరిజనుడు కారు ఢీకొని అక్కడికక్కడే ప్రాణాలు విడిచిన విషాద ఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. మృతుని బంధువులు తెలిపిన ప్రకారం.. కేసముద్రం మండలం తౌర్యతండా జీపీ పరిధిలో ముత్యాలమ్మతండాకు చెందిన గుగులోత్ గణేష్ (32) తండాలో ఎకరం వ్యవసాయ భూమి ఉన్నా పంటలు సరిగా పండకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాడు. తమ ఇద్దరు కుమారులను తొర్రూరులోని ప్రైవేటు హాస్టల్లో చేర్పించాడు. ఎనిమిది నెలల క్రితం తన భార్య పార్వతితో కలిసి హైదరాబాద్‌కు ఉపాధి కోసం వెళ్లాడు. పార్వతి ఇళ్లలో పనిమనిషిగా గణేష్ ఒక ప్రైవేటు కంపెనీలో నైట్‌వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కంపెనీకి వెళ్లిన గణేష్ ఉదయం తన విధులు ముగించుకొని సైకిల్‌పై తిరిగి తాను నివాసం ఉండే ప్రాంతానికి వెళుతుండగా మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అయ్యప్పసొసైటీ సమీపంలో ఓ కారు వేగంగా వెనుక నుంచి సైకిల్‌ను ఢీకొట్టింది. వెంటనే గణేష్ ఎగిరి పక్కనే ఉన్న రోడ్డు ప్లాట్‌ఫాంపై పడడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఉపాధి కోసం వెళ్లి ప్రాణాలు పోగొట్టుకోవడంతో తండాలో తీవ్ర విషాదం నెలకొంది.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మెపా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి జాతి అభివృద్ధి, ఐక్యత కోసం, రిజర్వేషన్ సాధన కోసం పోరాడాలన్నారు. అనంతరం మెపా జిల్లా ఉపాధ్యక్షులుగా భూమ నరేష్, కల్లెబోయిన కిరణ్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, నాయకులు తాళ్ల రవీందర్, సింగారపు రామకృష్ణ, దండు చిరంజీవి, సాధు రఘు, మోర రాజన్న, వెంకటనర్సయ్య, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

జనగామ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏబీవీ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల గడువు పొడిగిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల పోస్టులను ఈనెల 31 వరకు పొడిగించడం జరిగిందన్నారు. కామర్స్-1, పొలిటికల్ సైన్స్-1లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తిగల అభ్యర్థులు 31 వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. జనవరి 2న ఏబీవీ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

డిప్యూటేషన్లను రద్దు చేయాలి : టీపీటీఎఫ్

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పని చేయాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యాధికారులకు ప్రభుత్వం ఇచ్చిన డిప్యూటేషన్లను రద్దు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పాల ఉప్పస్వామి డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్రశిక్షా ఉద్యోగులు జిల్లాకేంద్రంలో చేపడుతున్న నిరవధిక సమ్మె శనివారం నాటికి 19వరోజుకు చేరుకోగా ఆయన శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా ఉప్పస్వామి మాట్లాడుతూ గత 19రోజులుగా సమస్యలను పరిష్కరించాలని సమగ్రశిక్షా ఉద్యోగులు సమ్మె చేస్తుంటే వారి సమ్మెను విరమించాల్సిందిపోయి వారి స్థానంలో ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపాలని చూడడం దారుణమని అన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో విద్యావ్యవస్థ కుంటుపడి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమగ్రశిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. శిబిరంలో టీపీటీఎఫ్ నాయకులు రాందేవ్, రఘురాం, శ్యాంసుందర్, పి.సమ్మయ్య, వైనాల స్వామి, బి.రమేష్, గోపి, సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, మహిళా అధ్యక్షురాలు జీవనప్రియ, కోశాధికారి పాడియా కుమార్, ఉపాధ్యక్షుడు ఎమ్డీ.ఫిరోజ్, సభ్యులు చిరంజీవి, రమేష్, దేవేందర్, ప్రవీణ్, ప్రతిభ, నాగలక్ష్మి, హరిత, అశ్విని, కవిత, భారతి, అనిత, రాధిక, జ్యోతి, గంగ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

హామీ నెరవేర్చిన మంత్రి సీతక్క

బోరు వేయడంతో తీరిన విద్యార్థినుల తాగునీటి కష్టాలు

కొత్తగూడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఇచ్చిన హామీని నెరవేర్చారు. మంత్రి గాంధీనగర్ గురుకులంలో విద్యార్థినుల తాగునీటి కష్టాలు విని మూడు రోజుల్లోనే బోరు వేయించి విద్యార్థినుల తాగునీటి కష్టాలు తీర్చారు.

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గాంధీనగర్‌లోని గిరిజన సంక్షేమ శాఖ బాలిక గురుకుల విద్యాలయంలో ఈ నెల 25న మంత్రి విద్యార్థినులతో బస చేశారు. గురుకులంలో తాగునీటి కష్టాల గూర్చి విద్యార్థినిలు, ఉపాధ్యాయులు మంత్రి సీతక్క దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే స్పందించిన సీతక్క బోరు వేయించాలని మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్‌ను ఆదేశించారు. శనివారం గురుకులంలో బోరు వే యించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుమ్మడి సమ్మయ్య, నాయకులు వజ్జ బాలరాజు, సిరిగిరి సురేష్, చందు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్ గురుకులంలో బోరును ప్రారంభిస్తున్న రణధీర్

ఆశాలకు న్యాయం జరిగే వరకు పోరాటం



మహబూబాబాద్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్లకు నెలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు చెల్లించేంతవరకు తమ పోరాటం ఆగదని సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. జయలక్ష్మి అన్నారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి చేపట్టిన బస్ జాత శనివారం మానుకోట జిల్లాకు చేరుకుంది. స్థానిక బస్టాండ్ ఏరియా వద్ద ఘన స్వాగతం పలికి పెరుమాండ్ల జగన్నాథం భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ... ఎన్నికల మెనిఫెస్టోలో పెట్టిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా వర్కర్లకు కనీస వేతనంనెలకు రూ.18 వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, ఆకుల రాజు, కుమ్మరికుంట్ల నాగన్న, యూనియన్ బాధ్యులు కె.సునిత, సాధన, పద్మ , బాలమణి, రమణ, ఉపేంద్ర, సుజిత, రమాదేవి, ఆసియా, స్వరూప, రేణుక, జ్యోతి. చంద్రకళ, కాశేశ్వరీ, నళిని, రాధ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

హాజరైన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

టేకుమట్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని పంగిడిపల్లిలో శనివారం ముదిరాజ్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరిగింది. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి దీవెనెలతో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఉండాలని కోరుకున్నారు. మరో అతిథిగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో పంగిడిపల్లి ముదిరాజ్ కులస్థులు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, మండల నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, బీఆర్‌ఎస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ఎస్సీ వర్గీకరణపై గళం విప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇరుగు పైడి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాల సాధనలో భాగంగా ఎస్సీ వర్గీకరణ కోసం గళం విప్పి గజ్జె కడదామని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) జాతీయ నాయ కుడు, చత్తీస్‌గఢ్ రాష్ట్ర ఇన్‌చార్జి ఇరుగు పైడి పిలుపునిచ్చారు. ములుగులో రొంటాల కుమార్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే ఏ కులానికి అన్యాయం జరుగదన్నారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీల్లో ఉన్న అన్ని కులాలకు రిజర్వేషన్లు లభించి న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ పోరాటం న్యాయమైనందునే సమాజం మొత్తం మద్దతు ఇచ్చిందని కానీ, మాలలు తమకున్న రాజకీయ పలుకుబడితో ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి నేడు బలంగా ప్రయత్నిస్తున్నారన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా వర్గీకరణ కోసం పోరాడాలన్నారు. అనంతరం జిల్లా కళాకారుల నిర్మాణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రొంటాల కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇనుముల రమేష్, ఉపాధ్యక్షుడిగా మందపల్లి నవీన్, కార్యదర్శిగా తిరుపతి, గౌరవ అధ్యక్షుడిగా గుగ్గిళ్ల సాగర్‌లు ఎన్నికయ్యారు. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబు, నాయకులు గజ్జెల ప్రసాద్, విజయ్, శంకర్, రాజేందర్, మల్లయ్య, దూడపాక రాజేందర్, కన్నం రాజు, నెమలి నర్సయ్య, వావిలాల స్వామి, మరాఠి రవీందర్, తోకల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అడ్రినల్ గ్రంథికి లాప్రోస్కోపిక్ చికిత్స

యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి

వరంగల్ మెడికల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అడ్రినల్ కణతిని లాప్రోస్కోపిక్ పద్ధతిలో తొలగించి రోగి ప్రాణాలను కాపాడినట్లు శ్రీనివాస కిడ్నీ సెంటర్ వైద్యులు యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన నాంపల్లి మానస (31) ఎడమవైపు కడుపునొప్పితో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొంది తగ్గకపోవడంతో తమ ఆస్పత్రికి వచ్చినట్లు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రోగికి ఎడమ అడ్రినల్ గ్రంథిలో కణతి 14 సెంటీమీటర్లు ఉండి స్ప్లీన్, ప్యాంక్రియాస్, ఎడమ కిడ్నీకి అతుక్కొని ఉందని గుర్తించామన్నారు.

మాట్లాడుతున్న యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి →



అత్యంత క్లిష్టమైన లాప్రోస్కోపిక్ పద్ధతిలో సుమారు 3 గంటల పాటు శ్రమించి ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశామ న్నారు. మిగతా అవయవాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఎంతో నైపుణ్యంతో శస్త్ర చికిత్స చేసి నట్లు తెలిపారు. హైదరాబాద్ తర్వాత హనుమ కొండలోనే ఈ తరహా ఆపరేషన్ తొలిసారి చేశా మన్నారు. యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డితో పాటు డాక్టర్ అభినయ్, డాక్టర్ ప్రభురామ్, అనస్తీషియా వైద్యులు సామ్రాట్ లాప్రోస్కోపిక్ సర్జరీలో పాల్గొన్నారు.

నేరం.. శిక్ష.. నింద

వరంగల్ క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాదిలో ఎఫ్ఐఆర్‌లు తక్కువగా నమోదైనప్పటికీ ఆస్తుల నేరాలు, మోసాలు, న్యూసెన్స్ ఘటనలు పెరిగాయి. కొంత మంది పోలీసులు వివాదాల్లో చిక్కుకొని పోలీసుశాఖ చెడ్డపేరు తీసుకొచ్చి ప్రజల్లో నమ్మకం పోయేలా వ్యవహరించారు. కొంతమంది పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజల ఫిర్యాదులపై సత్వరమే స్పందించి రాష్ట్ర పోలీసుబాస్‌తో ప్రశంసలు అందుకున్నారు. కమిషనరేట్‌లో కొత్తగా యాంటీ డ్రగ్ టీంతో పాటు వరంగల్, ఖమ్మం జిల్లాకు కలిపి జనవరిలో కొత్తగా ఏర్పాటైన నార్కోటిక్స్ బృందాలతో పోలీసుశాఖ గంజాయిని అధిక మొత్తంలో పట్టుకుంది.

సంచలనంగా మారిన ఎస్‌బీఐ దోపిడీ

వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో నవంబరు 18న అర్ధరాత్రి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఏడుగురు ముఠా సభ్యులు చొరబడి సుమారు రూ.14 కోట్ల విలువ చేసే బంగారం ఎత్తుకెళ్లడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. బ్యాంకు లాకర్లలో బంగారం దాచిపెట్టు కున్న ఖాతాదారులంతా బ్యాంకు వద్ద చేరుకొని పోలీసులను ప్రాధేయపడ్డారు.

ఎట్టకేలకు చోరీ జరిగిన 18 రోజులకు ఏడుగురు ముఠా సభ్యుల్లో నుంచి ఉత్తరప్రదేశ్‌కు చెందిన అర్షాద్ అన్సారీ, షాకీర్‌ఖాన్ ఆలియాస్ బోలెఖాన్, హిమాన్షు బిగాం చండ్ జాన్వర్‌ను అరెస్టు చేసి రూ.1,80,4000 విలువచేసే 2కిలోల 520 గ్రాములు బంగారం అభరణాలు, చోరీకి వినియోగించిన కారు, పదివేల నగదును స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నలుగురు నిందితుల్లో ప్రధాన నిందితుడు మహమ్మద్ నవాబ్ ఇటీవలే పోలీసులకు పట్టుకున్నప్పటికీ అతడి నుంచి ఎలాంటి బంగారాన్ని స్వాధీనం చేసుకోలేకపోయారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉండగా.. సుమారు రూ.12 కోట్ల విలువైన బంగారం జాడ ఇంతవరకు తెలియరాలేదు. చోరీ జరిగి రెండు నెలలకు పైగా అయినప్పటికీ బంగారం రికవరీ కాకపోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

డ్రగ్స్ నివారణకు కొత్తగా బృందాలు

కమిషనరేట్ పరిధిలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు కమిషనరేట్ కార్యాలయంలో యాంటీ డ్రగ్ టీమ్ కొత్తగా ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లో సీఐతో ఒక ఆర్ఐ, ముగ్గురు ఆర్ఎస్సైలు ఆరుగురు సిబ్బందిని ఏర్పాటు చేశారు.

ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు కొత్త నార్కోటిక్స్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. నార్కోటిక్స్ పీఎస్ ఈ ఏడాది జనవరి నుంచి పనిచేస్తుండగా డిసెంబర్ 3న సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండ పర్యటనకు వచ్చిన సందర్భంగా వర్చువల్ పద్ధతిలో పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. నార్కోటిక్స్ పోలీ సులతో పాటు కమిషనరేట్ యాంటీ డ్రగ్ టీమ్‌లు కలిసి పెద్ద మొత్తంలో గంజాయిని సీజ్ చేశారు. వెస్ట్‌జోన్‌లోని జనగామ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ విధులు కోసం ప్రత్యేకంగా 15 మంది సిబ్బందిని కేటాయించారు.

ప్రతిభకు ప్రశంసలు



పోలీసు శాఖలో 2024ది ప్రత్యేక పేజీ

ఫిర్యాదుదారులకు సకాలంలో సేవలందించినందుగానూ పౌర సేవల్లో భాగంగా ఆత్మకూరు, చిల్పూరు పోలీస్‌స్టేషన్‌లకు బెస్ట్ సిటిజన్ సర్వీస్ రాష్ట్ర స్థాయి అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కేంద్ర ప్రభుత్వం అందించే అతి ఉత్కృష్ట సేవా పతకాలకు హెడ్‌కానిస్టేబుల్ మల్లారెడ్డి, కానిస్టే బుల్ మహేశ్‌లు ఎంపికయ్యారు. సైబర్ నేరాలను నియంత్రించడం కోసం కేంద్ర హోంమంత్రి శాఖ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యలో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ కమాండోల శిక్షణకు తెలంగాణ రాష్ట్రం నుంచి వరంగల్ కమిషనరేట్‌లో డిప్యూటీ ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న ప్రశాంత్ ఎంపికయ్యాడు. మహిళపై జరిగిన సాముహిక అత్యాచారం కేసులో నిందితులకు ఉరిశిక్షపడేలా దర్యాప్తు జరిపిన ఇంటెలిజెన్స్ డీఎస్పీ ఆడెపు సత్య నారా యణకు నవం బర్ 1న కేంద్ర ప్రభు త్వం యూ నియన్ మెడల్ ప్రక టించింది.

ఏసీబీ దాడులు

అవినీతికి పాల్ప డుతూ అక్రమ అస్తు లను కూడబెట్టిన ప లువురు ప్రభుత్వ ఉద్యో గులను ఏసీబీ ప్రత్యేక నిఘా పెట్టి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 కేసులు నమోదు చేసి 28 మందిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. 2011లో ఓ కేసులో పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్‌కు ఏడాది జైలు శిక్ష పడింది.

హత్యల కలకలం

కిందటేడు కంటే ఈ ఏడాది హత్యలు కొంత తక్కువ జరిగినప్పటికీ ఈ మధ్యకాలంలో మట్టెవాడ పోలీస్టేషన్ పరి ధిలోని భద్రకాళి చెరువు కట్ట వద్ద కారులో లభ్యమైన రిటైర్డు బ్యాంకు ఉద్యోగి రాజుమోహన్ మృతదేహంతో నగరంలో కలక లం రేపింది. జఫర్‌గఢ్ మండలం బుర్హాన్‌పల్లిలో రాజకీయ కక్షల కారణంగా కిరాయి రౌడీలతో తండ్రీ, కొడుకులు కలిసి ఇంట్లో ఉన్న వ్యక్తిని అతి దారుణంగా చంపడం కమిషనరేట్‌లో తీవ్ర సంచలనంగా మారింది. ఇటీవల మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో బిహార్ వ్యక్తిని అనుమాన నెపంతో కొందరు వ్యక్తులు హతమార్చడం గ్రేటర్ వరంగల్‌లో తీవ్ర చర్చకు దారి తీసింది. రాజు మోహన్, బిహార్ వ్యక్తి కొద్ది రోజుల తేడాతోనే హత్యకు గురికావడం ప్రజలను భయాందోళనకు గురయ్యారు.

వివాదాల్లో పోలీసులు

ఐజీ అటాచ్‌గా ఉన్న సీఐ ఎం.రవికుమార్ కాజీపేట పీఎస్ పరిధిలోని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. అదే అపార్ట్ మెంట్‌లో ఉన్న బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు గురి చేయడంతో కాజీపేట పోలీస్‌స్టేషన్ రవికుమార్‌పై పోక్సో కేసు నమోదైంది. అజ్ఞాతంలో ఉన్న సీఐని ముందస్తు బెయిల్ తెచ్చుకునేంతవరకు అరెస్టు చేయకుండా కాపాడారని కమిషనరేట్ పోలీసులపై తీవ్ర విమర్శలు వచ్చాయి. మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ యూనిఫామ్‌లో పాల్గొని రాజకీయ ప్రసంగాలు చేస్తూ ప్రజల్లోకి తప్పుడు సమాచారం చేరవేశారనే విమర్శలు వచ్చాయి. ఓ మంత్రి బంధువుతో ఎల్కతుర్తి ఎస్సై రాజ్‌కుమార్ అంటకాగుతూ విధుల్లో అలసత్వం కారణంగా సస్పెన్షన్‌కు గురయ్యాడు. మరికొంత మంది అధికారులు వివాహేతర సంబంధాలు కొనసాగిస్తూ వార్తల్లో నిలిచారు.

అలాగే ఆగస్టు 2న పర్వతగిరి ఎస్సై గుగులోతు వెంకన్న రూ. 20,000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. 'ఏక్ స్టేట్ ఏక్ పోలీసు' నినాదాన్ని అమలు చేయాలని మామునూరు ఫోర్త్ బెటాలియన్ పోలీసులు రోడ్డెక్కారు.

ముందస్తు చర్యలతో నేరాలు తగ్గుముఖం

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ
- 2024 వార్షిక నేర నివేదిక విడుదల

వరంగల్ క్రైం, (ఆంధ్రజ్యోతి) : ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా గతంకంటే ఈ ఏడాది నేరాలు తగ్గాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పేర్కొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ 2024 సంవత్సరంనకు సంబంధించి క్రైం వార్షిక నివేదిక ప్రకటన సందర్భంగా శనివారం కమిషనరేట్ ఆవరణంలో సీపీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కమిషనరేట్ యాంటీ డ్రగ్స్‌తో పాటు వరంగల్ నార్కో టిక్స్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు ద్వారా కమిషనరేట్ పరిధిలో అధిక మొత్తంలో గంజాయిని పట్టుకుందన్నారు. పోలీస్‌శాఖలో క్రైమ్, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ మూడు విభాగాలుగా విభజించి ఉంటాయన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు జనగామ జిల్లాలో 15 మంది సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించామన్నారు. రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ నిబంధనలపై కొంత కాలంగా విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొత్తంగా గతం కంటే ఈసారి 11 శాతం క్రైమ్ రేటు తగ్గిందన్నారు. 45 మంది అంతరాష్ట్ర ముఠా సభ్యులను పట్టుకొని సుమారు రెండున్నర కోట్ల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు 590 కేసుల్లో 1,145 మంది నిందితులను అరెస్టు చేసి రూ.10,77,20,196 కోట్లను సీజ్ చేశామన్నారు. సిబ్బంది కొరతతో గతంలో కొంత ఇబ్బందులు ఉండేదని, ప్రస్తుతం ఈ ఏడాది 800 పోలీసులు కమిషనరేట్‌కు కొత్తగా వచ్చారన్నారు.

పాత, కొత్త వారిని కలుపుకొని రానున్న రోజుల్లో నేర రహిత సమాజంకు కృషి చేస్తామని సీపీ ప్రకటించారు. జనవరి 1 వేడుకల దృష్ట్యా ఇప్పటికే రోడ్లపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ మనాన్‌భట్, ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, అడిషినల్ డీసీపీ రవి, సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్‌రాజు, ఎస్‌బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి, సీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ కర్ణాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

నో కామెంట్స్

వార్షిక నివేదిక వెల్లడించిన అనంతరం విలేకరులు సంధించిన ప్రతీ ప్రశ్నకు సీపీ 'నో కామెంట్' అంటూ దాటవేశారు. పోక్సో కేసులో నిందితుడు సీఐ రవికుమార్ ముందుస్తు బెయిల్ తెచ్చుకునేంతవరకు ఎందుకు అరెస్టు చేయలేదు..? ఇది పోలీసుల వైఫల్యం కాదా? అని ప్రశ్నిం చగా సమాధానాన్ని దాటవేశారు. ఎల్కతుర్తి ఎస్సైపై సస్పెన్షన్ వేటు వేసి అదే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏసీపీ నందిరాంనాయక్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తే సమా ధానం చెప్పలేదు. రౌడీషీటర్ల ఆగడాలు మితి మీరుతున్నాయని పత్రికల్లో కథనాలు వస్తున్నాయి కదా.. వారిమీద ఎలాంటి చర్యలు తీసుకున్నారని అడగగా, కేసు నమోదైతేనే చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు కానివారిపై ఏ విధంగా చర్యలు తీసుకుం టామని సీపీ ప్రశ్నించారు. ఆపై విలేకరులు ప్రశ్నలు అడుగుతుండగానే సీపీ వేదికపై నుంచి వెళ్లిపోయాడు.

సంచలనాల ఏడాది

- అలజడి రేపిన వాజేడులో అన్నదమ్ముల హత్య
- రక్తమోడిన రోడ్లు.. భయపెట్టిన పెద్దపులి



చల్పాకలో మావోయిస్టుల మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్పీ శబరీశ్ (ఫైల్)

ములుగు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): 2024.. కాలగర్భంలో కలిసి పోతూ చేదు జ్ఞాపకాలను మిగిల్చింది. రాష్ట్రస్థాయిలో సంచలనం కలిగించిన పలు ఘటనలు ములుగు జిల్లాలో జరిగాయి. ఎన్‌కౌంటర్లు, హత్యలు, రోడ్డు ప్రమాదాలు అనేక కుటుంబాలను శోకసంద్రంలో ముంచాయి. డిసెంబరు 1న తెల్లవారుజామున ఏటూరునాగారం మండలం చల్పాక అటవీ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ముఖ్య నేతలు భద్రు, మధు ఉన్నారు. వారిపై పోలీసులు విషప్రయోగం చేశారని, బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ పౌరహక్కుల సంఘం ఆరోపించగా మధు భార్య మీనా హైకోర్టులో కేసు వేసింది. మరుసటి రోజే వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సూర్యపేట జిల్లాకు చెందిన అనూష అనే యువతి ప్రేమపేరుతో వంచించడంతో బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. నవంబరు 21న వాజేడు మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ఊకే రమేష్, ఆయన సోదరుడు అర్జున్‌ను మావోయిస్టులు కత్తులు, గొడ్డళ్లతో అతి కిరాతంగా హత్య చేశారు. తాడ్వాయి మండలం అల్లిగూడెం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు దళసభ్యుడు నల్లమారి అశోక్ హతమయ్యాడు. గంగారం అడవుల్లో ఏటూరునాగారం మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ సుజాత హత్యాచారానికి గురైంది. 24గంటల్లోనే ఈ కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో డిసెంబరు 22న ఓర్సు శ్రీను అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధం పెట్టు కున్న ఆయన భార్య, ప్రియుడు మరో ఇద్దరితో కలిసి అతడిని హత్య చేసిన ట్లు పోలీసులు నిర్ధారించారు. వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుర్రం పేటలో సకినాల సరస్వతి అనే మహిళ హత్యకు గురైంది. ఆమెను కొడుకే గొంతునులిమి హత్య చేసినట్లు తేలింది. జనవరి 26న ములుగులోని ఎస్సీ కాలనీలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అంజిత్, విజయ్ అనే ఇరువురు దుర్మరణం చెందారు. జూలై 3న వాజేడు మండలం కొంగాల అటవీ ప్రాంతంలో మావోయి స్టులు అమర్చిన మందుపాతర పేలి జగన్నాథపురానికి చెందిన ఇల్లందుల ఏసు అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వెంకటాపురం మండలానికి చెందిన దర్రా సునీత అనే మహిళ కర్రెగుట్ట అటవీప్రాంతంలో ప్రెషర్ బాంబు పేలి తీవ్రంగా గాయపడింది.

కుదిపేసిన చల్పాక ఎన్‌కౌంటర్, ఎస్సై హరీశ్ ఆత్మహత్య

మరికొన్ని సంఘటనలు

కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో ఆర్టీసీ బస్సు కింద పడి లక్ష్మి అనే వృద్ధురాలు మృతిచెందింది. ఇదే మండలం కంతనపల్లిలో లంజపెల్లి రవి అనే వ్యక్తి ట్రాక్టర్ రోటవేటర్‌లో పడి మరణించాడు. ఏటూరు గ్రామానికి చెందిన శిరీష అనే ఏడేళ్ల బాలిక కారు ఢీకొని మరణించింది. చిట్యాల గొత్తికోయగూడానికి చెందిన లక్ష్మయ్య అనే వ్యక్తి అడవిలో చెట్లను నరికివేసిన కేసులో పోలీసులు అరెస్టు చేస్తారని భయపడి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చింతగూడెం గ్రామానికి చెందిన గాధం రవీందర్ అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. గోవిందరావుపేట మండలంలో మద్దుల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కారు ఢీకొని మరణించాడు. తాడ్వాయి మండలంలో పోడును అడ్డుకున్నందుకు ఫారెస్టు అధికారులపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. జనగలంచ వద్ద లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో 34 మంది ప్రయాణికులు గాయపడ్డారు. జనగలంచ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏటూరునాగారం మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్, ఆమె కొడుకు దుర్మరణం పాలయ్యారు. వెంకటాపూర్ మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దాపూర్ వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో విద్యార్థులు వెంకటేశ్వర్‌రావు, మణిదీప్ మృతిచెందారు. రామప్ప ఆలయ పరిసరాల్లోని గొల్లాలగుడిని గుప్తనిధుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈఘటనకు పాల్పడిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ములుగు సమీపంలోని గట్టమ్మ దేవాలయం మలుపు వద్ద లారీ ఢీకొన్న సంఘటనలో ఎలక్ట్రీషియన్ వనం రాజు మరణించాడు. దేవగిరిపట్నంలో ట్రాక్టర్ తిరగబడి తేజావత్ హస్సేన్ మృతిచెందాడు. ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వాజేడు మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణరాజు, ఆయన భార్య సత్యవతి, కూతురు అనిత, ఆటో డ్రైవర్ నాగరాజు దుర్మరణం చెందారు. తాడ్వాయి మండలం తక్కెళ్లగూడెం గొత్తికోయగూడెంలో మంగమ్మ అనే మహిళను అనుమానంతో భర్త గొంతునులిమి హత్య చేశాడు. జూలై 23న వాజేడు మండలం బొగత జలపాతంలో మునిగి జశ్వంత్ అనే యువకుడు మృతి చెందాడు. అక్టోబరు 31న వాజేడు మండలం కిష్టాపురంలో పిడుగుపాటుకు గురై యువకుడు మృతిచెందాడు. నవంబరు 1న ఏటూరునాగారం మండలం రామన్నగూడానికి చెందిన రైతు చెన్నూరి మల్లయ్య అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు.



తాడ్వాయి అడవిలో పులి పాద ముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు (ఫైల్)

మావోయిస్టులపై పోలీసుల పైచేయి

ఛత్తీస్‌గఢ్- ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు కలిగిన ములుగు జిల్లా అడవులు నిత్యం పోలీసులు, మావోయిస్టుల చర్య, ప్రతిచర్యలతో అట్టుడికిపోతూనే ఉంటుంది. ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణలోకి వలస వచ్చేక్రమంలో మావోయిస్టులకు జిల్లా పోలీసులు అడ్డుకట్ట వేశారు. ఏప్రిల్ 5న ఛత్తీస్‌గఢ్‌లోని ఊసూరు పీఎస్ పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ ఆధ్వర్యంలో తెలంగాణ పోలీసులు ఈ ఎన్‌కౌంటర్‌కు పాల్పడి నట్టు మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. రెండు ఎన్‌కౌంటర్లలో 8 మంది మావోయిస్టులను కాల్చి చంపిన పోలీసులు పదిమందికి పైగా దళ సభ్యులు లొంగిపోయేలా చేశారు. తాడ్వాయి మండలం ఒడ్డుగూడెం అడవుల్లో మావోయిస్టులు దాచిన ఆయుధ డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వణికించిన పులుల సంచారం

ములుగు జిల్లాలోని అభయారణ్యం 800 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో కలిగి ఉంది. విభిన్న జంతుజాలానికి ఇది నిలయం. కొంతకాలంగా కనిపించని పులి ఈ ఏడాది సంచరించింది. సమీపంలోని పాకాల అడవుల నుంచి తప్పిపోయి వచ్చిన ఓ చిరుతపులి ములుగు మండలంలోని మదనపల్లి, రామచంద్రాపురం అడవుల్లో సంచరించింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన ఓ పెద్దపులి వెంకటాపురం, మంగపేట, తాడ్వాయి అడవుల్లో 15 రోజులపాటు సంచరించింది. దీంతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

పాత విద్యార్థులకు మళ్లీ పరీక్షలు!

- కేయూ ఇయర్ వైజ్ విద్యార్థులకు డిగ్రీ కల నెరవేర్చుకునే ప్రత్యేక అవకాశం
- 2016 కంటే ముందు వారికి నిర్వహణ



కేయూ క్యాంపస్ డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో పరిధిలో అప్పట్లెప్పుడో డిగ్రీ చదివారా.. మీరు డిగ్రీ చదివిన సందర్భంలో పరిస్థితులు అనుకూలించక ఫెయిల్ అయ్యారా? తర్వాత మళ్లీ పరీక్షలు రాసి పాసై డిగ్రీ సంపాదించుకుని ఉద్యోగం సాధించాలని పట్టుదలగా ఉన్నారా.. అయితే మీ కోసం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు మంచి అవకాశాన్ని కల్పించారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లోని డిగ్రీ కోర్సుల్లో ఇయర్ వైజ్ అభ్యర్థులకు డిగ్రీ కోర్సుల్లో తప్పిన సబ్జెక్టులకు ప్రత్యేక అనుమతులతో పరీక్షలు రాసే వెలుసుబాటును కల్పించారు. బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఇతర డిగ్రీ కోర్సుల్లోని సబ్జెక్టులతో పాటు ప్రాక్టీకల్స్, వైవా పరీక్షలకు సైతం ప్రత్యేక అనుమతి తీసుకుని తప్పిన సబ్జెక్టులకు మళ్లీ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించొచ్చు.

ఎవరెవరికి అవకాశం అంటే..

2016 సంవత్సరం కంటే ముందు ఇయర్ వైజ్ డిగ్రీ కోర్సులు చదివిన అభ్యర్థులందరికీ అవకాశం కల్పించారు. ఐతే వర్సిటీ ప్రత్యేక అనుమతి తీసుకుని పరీక్షలు రాయాలి. గతంలోనూ వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు 2020- 2021, 2021- 2022 ఏడాదిలో ఇలాంటి అభ్యర్థులకు అవకాశం కల్పించారు. అప్పుడు చాలా మంది అభ్యర్థులు ప్రత్యేక అనుమతితో పరీక్షలు రాసి డిగ్రీ కలను నేరవేర్చుకున్నారు. అయితే కొందరూ అనివార్య కార ణాలతో పరీక్షలు రాయలేక, రాసిన ఉత్తీర్ణత సాధించలేక మిగి లిపోయారు. వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు లెక్కల ప్రకారం 2016 కంటే ముందు ఇయర్ వైజ్ డిగ్రీ కోర్సుల్లో సుమారు 30 - 40 మంది డిగ్రీ కోర్సుల్లో కొన్ని సబ్జెక్టుల్లో తప్పి డిగ్రీ పట్టాను అందుకోలేకపోయినట్లు లెక్కలున్నాయి. వీరికి పృదూ ప్రత్యేక అనుమతితో మళ్లీ పరీక్షలు నిర్వహిస్తే కష్టపడి చదువుకుని ఉత్తీర్ణత పొందే అవకాశం ఉంది. 2016 ఏడాది నుంచి యూజీసీ నియమ నిబంధనల మేరకు డిగ్రీ కోర్సుల్లో దేశ వ్యాప్తంగా సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టారు. సెమిస్టర్ విధానంలో విద్యార్థులకు డిగ్రీ సప్లమెంటరీ పరీక్షలకు హాజ రయ్యే అవకాశం ఉంది. అయితే డిగ్రీ ఇయర్‌వైజ్ విద్యార్థులకు ఇప్పుడున్న సెమిస్టర్ విధానంతో ఇబ్బందుల్లో పడ్డారు. ఆ ఇబ్బం దులను తొలగించి వారి డిగ్రీ పట్టాకలను నేరవేర్చేందుకు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు.

అనుమతి కోసం దరఖాస్తులు ఎలా చేయాలి?

డిగ్రీ ఇయర్‌వైజ్ విద్యార్థులందరూ మొద టగా వర్సిటీ క్యాంపస్ పరిపాలన భవనం లోని అకాడమిక్ బ్రాంచ్‌లో సంప్రదించాలి. వారు ఏ ఏడాది ఏ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారో.. వర్సిటీ అధికారులకు తెలియజేస్తూ దరఖాస్తులు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు వారి డిగ్రీ మెమోను జత చేయాలి.

వర్సిటీ అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తారు. దీనికి గాను వర్సిటీకి ఒక్కో పేపర్‌కు రూ. 3 వేల చొప్పున ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించాలి. ప్రాసెసింగ్ ఫీజుతో పాటు అదనంగా మళ్లీ పరీక్షల ఫీజు ఒక్కో పేపర్‌కు రూ. 4 వేలు అభ్యర్థులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే దివ్యాంగ విద్యార్థులకు అకాడమిక్ బ్రాంచ్‌లో చెల్లించాల్సిన ఫీజులు ఉండవు. పరీక్షల ఫీజు మాత్రం ఒక్కో సబ్జెక్టుకు రూ. 500లు చెల్లించాలి. ఫీజులు చెల్లించుకున్న అభ్యర్థులందరికీ వర్సిటీ రిజిస్ట్రార్ అర్డర్ మేరకు వారు చదివిన కళాశాలల్లో పరీక్షల ఫీజులు చెల్లించుకునే అవకాశం ఉంది.

ఫీజులు కళాశాలల్లోనే చెల్లించుకోవాలి

వర్సిటీ అకాడమిక్ బ్రాంచ్‌లో దరఖాస్తులు చేసుకున్న తర్వాత రిజిస్ట్రార్ పేరుతో అభ్యర్థులకు అర్డర్‌ను వెలువరిస్తారు. ఆయా అర్డర్ మేరకు విద్యార్థులు వారు చదివిన కళాశాలల్లో ఒక్కో పేపర్‌కు పరీక్షలు ఫీజులు చెల్లించుకోవాలి.

అభ్యర్థులకు సిలబస్‌ను ముందే చెబుతారు..

ప్రత్యేక అనుమతితో ఇయర్ వైజ్ స్కీంలో దరఖాస్తులు చేసుకుని పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులందరికీ వారి సబ్జెక్టు వైజ్‌గా ముందుగానే ఆయా పరీక్షల సెలబస్‌ను వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు చెబుతారు.

ఉదాహరణకు 2001-2023 ఏడాదిలో డిగ్రీ చదివిన అభ్యర్థులకు వారు చదివిన ఏడాదిలో వర్సిటీలో అమల్లో ఉన్న సెలబస్‌తోనే పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తారు. అయితే కొన్ని సబ్జెక్టులు అవుట్ డేడ్ అవుతాయి. అవుట్ డేడ్ అయిన సబ్జెక్టులకు వర్సిటీలోని అయా విభాగాల పాఠ్య ప్రణాళిక విభాగం వారిచ్చే సరిసమానమైన సబ్జెక్టు పేపర్‌లో పరీక్షలకు అనుమతిస్తారు. సిలబస్ దాదాపుగా సరిపోయే విధంగా విద్యార్థులకు న్యాయంగా ఉండేది నిర్ణయిస్తారు. పరీక్షల ఫీజులు చెల్లించే సమయంలోనే ఆయా సబ్జెక్టుల వివరాలను అభ్యర్థులకు స్పష్టంగా వర్సిటీ ఉన్నతాధికారులు చెబుతారు.

ఫీజుల షెడ్యూల్ ఇలా

2025 జనవరి 31 వరకు వర్సిటీ అకాడమిక్ బ్రాంచ్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజిస్ట్రార్‌కు ప్రత్యేక అనుమతి కోసం దరఖాస్తులు సమర్పిం చుకోవాలి. తర్వాత 2025 ఫిబ్రవరి 1 వరకు సంబంధిత కళాశాలలో పరీక్షల ఫీజులు చెల్లించుకోవాలి. అప్పట్లో అభ్యర్థులు చదివిన కళాశా లలు అనివార్య కారణాలతో ఇప్పుడు మూసి వేస్తే ఆయా కళాశాలల అభ్యర్థులు నేరుగా వర్సిటీలోనే పరీక్షల ఫీజులు చెల్లించుకుని పరీక్షలకు హాజరైయ్యే అవకాశం ఉంది.

వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్‌లో పరీక్షా కేంద్రాలు

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇయర్‌వైజ్ స్కీంలో పరీక్షలకు హాజరైయ్యే అభ్యర్థులకు పరీక్షలు నిర్వ హిస్తారు. అన్ని సబ్జెక్టులకు ప్రత్యేకంగా పరీక్షల టైం టేబుల్‌ను ప్రకటిస్తారు. పరీక్షలు ఫీజుల షెడ్యుల్ గడువు ముగిసిన తర్వాత పరీక్షల ప్రాసెస్‌ను కొనసాగించి పరీక్షలు టైం టేబుల్ షెడ్యుల్‌ను వెల్లడించారు.

పాత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

వర్సిటీ పరిధిలోని ఇయర్‌వైజ్ స్కీంను పాత విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలి. మూడేళ్ళు ఎంతో కష్టపడి రెగ్యులర్‌గా డిగ్రీ కోర్సులు అభ్యసించి అఖరుగా అప్పట్లో పరీక్షలు రాసే సమయంలో అనివార్య కారణాలతో విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేకపోవచ్చు. అలాగే ఇతర కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతోనూ పరీక్షలు తప్పవచ్చు. కొందరూ విద్యార్థులకు ఆరోగ్యం సహకరించకపోవచ్చు. అన్ని పరీక్షల సబ్జెక్టులు ఉత్తీర్ణత సాధించి ప్రాక్టీకల్స్, వైవా పరీక్షల్లోనూ ఫెయిల్ కావచ్చు. వారందరూ ఇప్పుడూ మళ్లీ పరీక్షలు రాయేచ్చు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డిల ఇతర అధికారుల అనుమతితో పరీక్షలు నిర్వహిస్తున్నాం. పాత విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ప్రొఫెసర్ కట్ల రాజేందర్, పరీక్షల నియంత్రణాధికారి, కేయూ



బొంగులో చికెన్, బిర్యానీలను చూశాం. తాజాగా 'బొంగులో కల్లు'ను కూడా విక్రయిస్తున్నారు. తాటిచెట్లకు లొట్ల స్థానంలో వెదురుబొంగులు కట్టి.. వచ్చిన కల్లును విక్రయిస్తున్నారు. సాధారణకల్లు కంటే ఈ బొంగులో కల్లు రుచిగా కూడా ఉంటోందని కల్లు ప్రియులు చెబుతున్నారు. ఇక ఈ కల్లుకు గిరాకీ ఉంటుండంతో గీతవృత్తి దారులు కూడా బొంగులో కల్లునే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం ప్రాజెక్టునగర్ సమీపంలోని తాటిచెట్లకు ఇదిలో ఇలా లొట్టిస్థానంలో బొంగులను కట్టారు.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి', భూపాలపల్లి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివి



ఎన్టీఆర్ స్టేడియంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ నేతలు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు శనివారం నివాళులర్పించారు. ఆయన ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ప్రధాని కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య మాట్లాడారు. జర్పుల వీరన్న, పూజారి వెంకటేశ్వర్లు, మేడ వెంకట్, రాజన్న, రవీందర్, దేవ్‌సింగ్, రాంబాబు, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, పులి దామోదర్, డోలి జగదీష్, సాగర్, కృష్ణయ్య, పెద్ది వెంకన్న, గోనె శ్యాంరావు, ఆకుల వెంకటేశ్వ ర్లు, నర్సింహారావు, భద్రు, గునిగంటి కమాలకర్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

● కేసముద్రం, (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజి శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో శనివారం మన్మోహన్‌సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్, ప్రిన్సిపాల్ చిర్ర నరేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన్మోహన్‌సింగ్ మృతిపట్ల టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు సురేందర్ సంతాపం వ్యక్తం చేశారు.

● గార్ల (ఆంధ్రజ్యోతి) :కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విద్యా వేత్త, ఆర్థిక సంస్కర్త భారత దేశ మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణంతో దేశం గర్వించ దగ్గ నాయకుడిని కోల్పోయిందని గార్ల మండల కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తాళ్ల పల్లి కృష్ణాగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నెహ్రూ సెంటర్‌లో మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి కాంగ్రెస్ శ్రేణులు. పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ నాయక్, షంషాద్ బేగం, గుండా వెంకటరెడ్డి, దీకొండ రాము, పృధ్వీరాజ్ నాయక్, యాకుబ్ పాషా, బానోత్ హతీరాం నాయక్, బాదం సురేందర్, బోడా ప్రశాంత్, సురేందర్, రవి పాల్గొన్నారు.



కేసముద్రం విలేజిలో దివంగత ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న కరస్పాండెంట్ యాకాంతంగౌడ్

ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేయాలి



రాణాలో మొక్కకు నీళ్లు పోస్తున్న డీఎస్పీ కృష్ణ కిషోర్

నర్సింహులపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంతో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని తొర్రూరు డీఎస్పీ క్రిష్ణకిషోర్ అన్నారు. శనివారం నర్సింహులపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి నూత నంగా ఏర్పాటు చేసిన బ్యాట్మింటన్ కోర్టును ప్రారంభిం చారు. సిబ్బంది కిట్ బాక్స్‌తోపాటు, రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి, నల్ల బెల్లం, పీడీఎస్ బియ్యం లాంటి దందాలపై నిత్యం నిఘా పెట్టి నివారించాలన్నారు.

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రభుత్వ చీఫ్ విప్ రాంచంద్రునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రు నాయక్

తొర్రూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ అన్నారు. శనివారం రాత్రి తొర్రూరులోని ఓ ప్రైవేటు పాఠశాల వార్షికోత్సవానికి సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణతో కలిసి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం విద్యా రంగానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రైవేటు పాఠశాలలు కృషి చేయాలని కోరారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మా ట్లాడుతూ సినీ హీరోలను గురించి కాకుండా త్యాగాల గురించి తెలుసుకోవడం అవసరమన్నారు. సెల్ ఫోన్, టీవీలకు దూరం గా ఉండి పరీక్షలపైన దృష్టి కేంద్రీకరిస్తే మంచి ఫలితా లు సాధించవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శిం చిన సంస్కృతిక ప్రదర్శనలు అతిథులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంఈవో బుచ్చయ్య పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, వైద్యులు రాజేందర్ రెడ్డి, లక్ష్మీనర్సింహారావు, మధుకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదాలు.. ఆత్మహత్యలు

(5వ పేజీ తరువాయి)

స్టేషన్ లోని ఉప్పరపల్లి రోడ్‌లో బత్తుల అనూష(30)ను ఆమె భర్త ఉరి వేసి చంపి ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఇంటి ఆవరణలోని చేద బావిలో మృతదేహాన్ని వేలాడదీయడం సంచలనం రేపింది.

● మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు రాళ్లవాగులో డీసీఎం వ్యాను తో పాటు ఐదుగురు కొట్టుకుపోగా, అందులో నలుగురిని పోలీసులు రక్షించా రు. ఒకరు గల్లంతు కాగా, అచూకీ లభ్యం కాలేదు.

● దంతాలపల్లి మండల కేంద్రం శివారులో జూలై 5న రాత్రి కారు, ఆటో ఢీకొన్న ఘటనలో తొర్రూరు మండలం వెలికట్టె గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మల్లేష్‌తో పాటు బీరిశెట్టిగూడెంకు చెందిన కొమురయ్య, దంతాలపల్లి మం డలం వాల్యతండాకు చెందిన నరేష్‌లు మృతి చెందారు.

● నవంబరు 12న బంధువుల అంత్యక్రియాలకు వెళ్లి వస్తుండగా తొర్రూరు- వలిగొండ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దవంగర మండలం అమర్‌సింగ్ తండాకు చెందిన జాటోతు శాంతమ్మ, జాటోతు వెంకన్న మృతి చెందారు.

● మార్చి 10న గార్ల మండలం అంకన్నగూడెం గ్రామంలో తల్లిదండ్రులు చిన్నారు లకు పాలల్లో పురుగుల మందు కలిపి హత్య చేశారు. మ ర్నాడు నామాల పాడు గుట్టల్లో తల్లిదండ్రులు ఆత్మహ త్యకు పాల్పడ్డారు.

● అక్టోబర్ 20న గార్ల మండలం సీతంపేట గ్రామంలో ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్ మహేష్‌ను హత్య చేశారు.

● సెప్టెంబర్ 14న తొర్రూరు మండలం కంఠాయ పాలెం గ్రామానికి చెందిన ఉపాధిహామి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ) ఈరబోయిన రమేష్ (30) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అక్టోబర్ 30న తొర్రూరు మండలం పోలేపల్లిలో రైతు పందుల వెంకటేశ్వర్లు అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. డిసెంబర్ 26న అమ్మాపురం గ్రామ శివారుల్లో తవ్వకాలు జరిపి వదిలేసిన క్వారీ గుంతలో పడి కడెం హరీష్ మృతి చెందాడు.

ఓసీ క్లబ్ కాదు.. అది ముమ్మాటికి ప్రభుత్వ క్లబ్

సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్‌టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నడిబొడ్డున రెండెక రాల స్థలంలో ఉన్నది ఓసీ క్లబ్ కాదని, అది ముమ్మాటికి ప్రభుత్వ క్లబ్ అని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్‌సారథిరెడ్డి అన్నారు. ఓసీ క్లబ్ ను ప్రభుత్వం స్వాధీనం చేసకుని ప్రజా అవసరా లకు వినియోగించాలని డిమాండ్ చేస్తూ మహబూ బాబా ద్‌లోని ఓసీ క్లబ్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో శనివా రం ఆందోళన చేపట్టారు. ఇది ఓసీ క్లబ్ కాదని... ప్రభుత్వక్లబ్ అని ప్రింట్ చేసిన తెల్లజెండాలు ప్రదర్శిం చి అక్కడ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అజయ్ సారథిరెడ్డి మాట్లాడుతూ... రెండు ఎకరాల్లో రూ.50 కోట్ల విలువ చేసేది ఓసీ క్లబ్ కాదని అది ముమ్మాటికి ప్రభుత్వ క్లబ్ అని చెప్పారు. ఓసీ క్లబ్‌ను స్వాధీనం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ ప్రభుత్వ క్లబ్ పేరుతో నాటి కలెక్టర్ మౌల్విఅబ్దుల్‌బాసిత్ ఖాన్ సాహెబ్ పేరిట పార్శి భాషలో ఇంగ్లీష్ క్యాలెండర్ ప్రకారం 27 అక్టోబరు 1930న శంకుస్థాపన చేసినట్లుగా ఉందని చెప్పారు. ఆ తర్వాత రాజకీయ పలుకుబడితో మహ బూబాబాద్ క్లబ్‌ను ఆఫీసర్స్ క్లబ్‌గా చలామణిలోకి తెచ్చారని ఆరోపించారు. 6-4-1/1 ఇంటి నెంబరుతో ఉన్నది ఓస్లీ క్లబ్ కాదని అది మహబూబాబాద్ క్లబ్ అని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, సాంబలక్ష్మి, రవి, శ్రావణ్, ఫాతిమా, రమేష్, వీరన్న ,మహమూద్, నక్క నాగా ర్జున, చిరంజీవి, రవీందర్, రాజకుమారి, శ్రీనాథ్, మలికార్జున్, రాణి , చంద్రబోస్, మాధవి తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ ఓసీ క్లబ్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రజా నాయకుడు నూకల నరేష్‌రెడ్డి

డోర్నకల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :నూకల నరేష్‌రెడ్డి ప్రజల అభిమా నాన్ని చూరగొన్న నాయ కుడని డోర్నకల్ మునిసిపల్ వైస్ చైర్మన్ కె.కోటిలింగం అన్నారు. శనివారం డోర్నకల్ ఎస్సీ, బీసీ కాలనీలో బుద్దిస్టు సోసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నూకల నరేష్‌రె డ్డి సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కోటిలింగం మాట్లాడారు... సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు వచ్చిన ప్రజలకు నూకల నరేష్‌రెడ్డి సమస్య పరిష్కార మార్గం చూపేవారని చెప్పారు. నరేష్‌రెడ్డి వల్లనే తాను డోర్నకల్ సర్పంచ్‌గా గెలిచానని చెప్పారు. డోర్నకల్ పీఏసీఎస్ చైర్మన్ బిక్షంరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుమీర్‌చంద్‌జైన్, న్యాయవాది కొత్త రాంబాబు, కాంగ్రెస్ నాయకులు రాంలాల్, అంబరీష, వెంకట్‌రెడ్డి, ఖాదర్‌బాబా, వీరభద్రం, దాసరి నానిలు పాల్గొన్నారు.



డోర్నకల్‌లో నూకల నరేష్‌రెడ్డి కుమారుడు అభినవ్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మహబూబాబాద్ ఎడ్యుకే షన్, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాదించేందుకు స్టడీ మెటీరి యల్ అందించటం అభినం దనీ యమని జిల్లా విద్యాశాఖాధి కారి రవీందర్‌రెడ్డి అన్నారు. మహ బూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం గ్రామ నివాసి గట్ల శ్రీపాల్‌రెడ్డి రూ. 5 వేల విలువ గల స్టడీ మెటీరియల్‌ను 59 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వీరయ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. మానుకోట శివారు జమాండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్ఫూర్తి ఎడ్యుకేనల్ రూరల్ డెవలప్‌మెంట్ అధ్యక్షులు రామసహాయం శ్రీధర్‌రెడ్డి చొరవతో హన్మకొండ లయన్స్ క్లబ్‌కు చెందిన దాత యర్రంరెడ్డి మహేందర్‌రెడ్డి సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను జిల్లా చైల్డ్ వెల్ఫేర్ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం సమ్మెట వెంకటేశ్వర్లు, లయన్స్ క్లబ్ బాధ్యులు రేపూరి రమణారెడ్డి, సుభాష్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సైదుల్‌రెడ్డి, శ్యాంప్రసాద్, శ్రీనాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డీఈవో

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పూజలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాశాఖలో కీలక పాత్ర పోషిస్తున్న సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మానుకోట శివారు అనంతాద్రి శ్రీ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మె శనివారం నాటికి 23వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరం నుంచి ఉద్యోగులు పట్టణం నుంచి భారీ ర్యాలీగా అనంతాద్రి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవి. వీరస్వామి, రమేష్, సాగర్, రాజశ్రీ, వీణ, సరస్వతి, ప్రభావతి, విజయలక్ష్మీ, ఉప్పలయ్య, సంతోష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలి

నెహ్రూసెంటర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని బాధితులు శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గుండాల మురళీధర్‌కు బాధితుడి బావ బానోత్ శంకర్ ఫిర్యాదు చేశారు. కేసముద్రం మండలం బేరువాడ శివారు మచ్చతండాకు చెందిన బోడ గణేష్ అనే యువకుడు ఈ నెల 23న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. అయితే మెరుగైన వైద్యం కోసం బోడ గణేష్‌ను మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వైద్యం కోసం తీసుకురాగా, సదరు అస్పత్రి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహ రించారని, దీంతో గణేష్ ఆరోగ్య పరిస్థితి విషమించి అస్వస్థతకు గురయ్యాడని, దీంతో వరంగల్‌కు తరలించినట్లు చెప్పారు. బాధితుడి నుంచి రూ.3.70 లక్షలను ఫీజు రూపంలో వసూలుచేశారని ఆరోపించారు. గణేష్ ఆరోగ్య పరిస్థితి విషమించడానికి కారణమైన ప్రైవేట్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏజీపీగా నియమితులైన సునీత

గార్ల డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముల్కనూరు పంచాయితీ గుంపెల్లగూడెం గ్రామానికి చెందిన తాటిపాముల సునీత జిల్లా కోర్టులో ఏజీపీగా నియమితులైనారు. గత పది సంవత్స రాలుగా సునీత జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తు న్నారు. ఈమేరకు ఆమెను ఏజీపీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏజీపీగా నియమి తులైన సునీతను పీఏసీఎస్ చైర్మన్ వల్లమూడి దుర్గాప్ర సాద్, అందనాల రాజీవ్ నాయుడు, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ నాయక్, జాస్తీ సత్యనారాయణ, జాస్తీ సాగర్‌బాబు, పలువురు అధికారులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



తాటిపాముల సునీత

సామాజిక సేవకు ప్రతి రూపం లయన్స్‌క్లబ్

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకు ప్రతిరూపం లయన్స్‌క్లబ్ అని.. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు అవసరమయ్యే సేవలను క్లబ్ అందిస్తుందని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ 320 ఎఫ్ డిస్ట్రిక్ గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ గవర్నర్ విజిట్‌లో భాగంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్-320 ఎఫ్‌లో 90 క్లబ్‌లకు పైగా ఉన్నాయని అందులో 3 వేలకు పైగా సభ్యులున్నారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని జనగామ, హన్మకొండ, తొర్రూరు కేంద్రాల్లో లయన్స్ ఆధ్వర్యంలో పర్మినెంట్ ప్రాజెక్టు కింద అన్నదాన కార్యక్రమాలు కొనసాగు తున్నాయని తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసి తీవ్రంగా నష్ట పోయిన ప్రజలకు లయన్స్‌క్లబ్ మానుకోట శాఖ తరపున సుమారు రూ. 9 నుంచి 10 లక్షల విలువ గల నిత్యావసర సరుకులు, బియ్యం, వారికి అవసరమయ్యే ఇతర వస్తువు లను అందించారని తెలిపారు. అనంత రం రెండు కుట్టుమిషన్లు, ఐదు సైకిళ్లు, వంద మంది నిరుపేదలకు దుప్పట్లు, పదవతరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ గైడ్‌లు, రూరల్ పోలీస్ స్టేషన్‌కు ఆరు బెంచీలు, బాలసదనంలో పిల్లలకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఆయా కార్యక్రమాల్లో రీజినల్ చైర్మన్ రామసహాయం వెంకట్‌రెడ్డి, రేపూరి రమణా రెడ్డి, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, పుట్ట హరికిషన్‌రెడ్డి, అనుమా ల వెంకటేశ్వర్లు, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, నూకల నర్సింహారెడ్డి, కొండపల్లి కేశవరావు, డాక్టర్‌వి. జగన్మోహన్‌రావు, కె. చంద్రశేఖర్, మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, చాడ అశోక్‌రెడ్డి, అనుమాల సిద్ధార్థ, మాలె కాశీనాథ్, పర్కాల రవీందర్‌రెడ్డి , కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, నాయిని రంజిత్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి పాల్గొన్నారు.

● కురవి, (ఆంధ్రజ్యోతి) : కురవి శ్రీ వీరభద్రస్వామి సన్నిధిలో లయన్స్‌క్లబ్ గవర్నర్ వెంకట్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరభద్రస్వామి, భద్రకాళి దేవాలయాల్లో మొక్కులు తీర్చుకున్నారు. లయన్స్‌క్లబ్ బాధ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బాలసదనంలో పిల్లలకు న్యూట్రిషన్ కిట్లను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ 320 ఎఫ్ డిస్ట్రిక్ గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి

కాగితాలపై లెక్కలు.. కనిపించని మొక్కలు

ఉపాధి హామీలో రూ.7.25 లక్షలు దుర్వినియోగం

నర్సింహులపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాగితాలపై లెక్కలు.. కనిపించని మొక్కలు అనే చందంగా ఉన్నాయి నర్సింహులపేట మండలంలో జరిగిన ఎన్ఆర్ఈజీఎస్ పనుల తీరు. ఎఫ్ఏలు, టీఏలు, పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో భారీ మొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు సోషల్ ఆడిట్ బృందం వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.7.25 లక్షలు దుర్వినియోగమైనట్లు శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగిన ఓపెన్ ఫోరంలో తనిఖీ బృందం వెల్లడిం చారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు 311 పనులకు రూ. 6.69 కోట్లు ఖర్చు చేశారు. ఆయా పనులపై 15వ విడత సామాజిక తనిఖీలో బృందం క్షేత్రస్థాయి పనుల పరిశీలన జరిపి నివేదికను ఓపెన్ ఫోరంలో వెల్లడించారు. నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, వాటర్ ట్యాంకు, రేగడి పూడికతీత పనులలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు రికార్డులను తారుమారు చేసి నిధులను దుర్వినియోగం చేసినట్లు తనిఖీ బృందం వెల్లడించారు. అలాగే అవెన్యూ ప్లాంటేషన్, మొక్కల పెంపకంలో నిధులు భారీ మొత్తంలో స్వాహా చేసినట్లు తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్ ఏఫ్ఏలతో కుమ్మక్కై ఏపీవో, ఎంపీడీవో, టీఏల సంతకాలు లేకుండా బిల్లులు చేసినట్లు ఆడిట్ అధికారులు వెల్లడిం చారు. ఆడిట్ అధికారులు ఇచ్చే నివేదికను పరిశీలించి సంబంధిత అధికారుల నుంచి రికవరీ చేయడంతో పాటు శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ మధుసూదన్‌రావు తెలిపారు. అడిషనల్ పీడీ వీరబాబు, అంబుడ్స్‌మన్ బెస్త ఆదాము, ఎంపీడీవో మాధవి ఉన్నారు.

గ్రామాల వారీగా నిధుల దుర్వినియోగం..

జయపురం రూ.1,16,915, కొమ్ములవంచ రూ.31,390, పడమటిగూడెం రూ.59,919, బాసుతండా రూ.34,393, అజ్మీరతండా రూ.34,064, ముంగిమడుగు రూ.17,916, నర్సింహాపురం బంజర రూ.28,982, వంతడుపల రూ.20,176, పకీరతండా రూ. 36,196, వస్రాతండ రూ.30,334, బక్కతండా రూ.21,011, జగ్గుతండా, రూ.15,657, రామన్నగూడెం రూ.21,657, బస్యతండా రూ.11,924, లోక్యతండా రూ.36,737, పెద్దనాగారం స్టేజీ రూ.25,084, రూప్లా తండా రూ.5920, గోపతండా రూ.6752, బొజ్జన్నపేట రూ.28,791, కొసల్వాదే విపల్లి రూ.97,419, పెద్దనాగారం రూ.15,545, నర్సింహులపేట రూ. 27,496 చొప్పున రూ.7,24,055 లక్షలు దుర్వినియోగమైనట్లు తనిఖీ బృందం నిర్ధారించి నట్లు పీడీ మధుసూదన్‌రావు తెలిపారు.



ఓపెన్ ఫోరంలో వివరాలు వెల్లడిస్తున్న తనిఖీ బృందం

పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ని షెడ్యూల్డ్ కులాలకు చెందిన పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌ల మంజూరు కోసం అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. నరసింహ స్వామి శనివారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను http://tgepasstelangana.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకో వాలన్నారు. అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకునే విధంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రోత్సహించాలని సూచించారు.

ఎల్‌హెచ్‌పీఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా పవన్

నెహ్రూసెంటర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) మహబూబాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా బానోత్ పవన్‌కుమార్‌ను ఏకగ్రీవంగా నియమించినట్లు ఆ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి బోడ లక్ష్మణ్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షులు ఆంగోతు చందులాల్, భూక్య రాంమ్మూర్తినాయక్, జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మరిపెడ బస్టాండ్ ప్లాట్‌ఫాం ప్రారంభం వాయిదా

మరిపెడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మరిపెడ బస్టాండ్ ప్లాట్‌ఫాం శనివారం ప్రారంభం కావాల్సి ఉండగా వాయిదా పడింది. మా జీ పీఎం మన్మోహన్‌సింగ్ అకాల మృతితో దేశ వ్యాప్తంగా వారం రోజులు సంతాప దినాలు నిర్వహిస్తుండడంతో ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ సూచన మేరకు అధికారులు వాయిదా వేశారు. జనవరి మొదటి వారం లో ప్లాట్‌ఫాం, బస్టాండ్ ప్రారంభించనున్నారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

నర్సింహులపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నర్సింహులపేట మం డల కేంద్రం శివారు ఓ తండాకు చెందిన బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సురేష్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహులపేట పరిధిలోని ఓ తండాకు చెందిన ఇంటర్మీ డియ ట్ చదువుతున్న బాలుడు మరో తండాకు చెందిన ఎనిమిదో తరగతి విద్యాభ్యాసం చేస్తున్న బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. అతడి వేధింపులు తాళలేక బాధిత బాలిక ఈ నెల 27న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

డోర్నకల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై చనిపోయిన గేదెను ఢీకొట్టి ఆటో బోల్తాపడిన ఘటనలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు డోర్నకల్ సీఐ రాజేష్‌నాయక్ తెలిపారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపా లెం మండలం ఎర్రగడ్డగ్రామానికి చెందిన గద్దల వెంకటయ్య ఈ నెల 25న ఓ శుభకార్యానికి రావిగూడెంకు ఆటోలో వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై పడిపోయి ఉన్న గేదేను ఆటో ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో వెంకటయ్య తలకు తీవ్రగాయాలు కావడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వెంకట య్య కుమారుడు సుమన్ ఈ ఘటనపై 28న డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మోడల్ స్కూల్ టీచర్లపై పేరెంట్స్ ఆగ్రహం

మరిపెడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మోడల్ స్కూల్ టీచర్లపై ఆ స్కూల్ పిల్లల తల్లిదండ్రులు శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిస్మస్ పండుగ ముందు రోజు ప్రిన్సిపాల్ అనుమతి లేకుండా మతపరమైన కార్యక్రమాలు నిర్వహించినట్లు పేరెంట్స్‌కు విద్యార్థులు తెలుపడంతో స్కూల్‌కు చేరుకొని అందుకు కారకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ సత్తార్‌పాష సంబంధిత టీచర్లతో వివరణ ఇప్పించి, ఇంకోసారి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండా చూసుకుంటామని హామీ ఇవ్వడంతో పేరెంట్స్ సైతం శాంతించారు.

జాతీయ గణిత ఛాలెంజ్ పోటీల్లో

మహర్షి విద్యార్థి ప్రతిభ



హర్షవర్ధన్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో అక్టోబర్ 8న ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయ గణితఛాలెంజ్-2024 పోటీల్లో మహర్షి విద్యాలయ విద్యార్థి లకావత్ హర్షవర్ధన్ ఉత్తమ ప్రతిభ కనబరి చినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎం. సుధాఅర్జున్‌రెడ్డి శనివారం తెలిపా రు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మహర్షి విద్యాలయలో 10వ తరగతి విద్యనభ్యసిస్తున్న హర్షవర్ధన్ జాతీయ గణిత పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల్లో 100లోపు ర్యాంకు సాధించినట్లు పేర్కొ న్నారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్వహించిన ఈ పోటీల్లో విజయవాడ రీజియన్ నుంచి విద్యార్థి పాల్గొని ర్యాంకు సాధించినట్లు తెలిపారు. విద్యార్థి హర్షవర్ధన్ జాతీయ గణిత ఛాలెంజ్ పోటీ ల్లో పా ల్గొని ర్యాంకు సాధించడంపై కరస్పాండెంట్ సుధా అర్జున్‌రెడ్డి, ఉపాధ్యా య బృందం ఎం.శ్వేత తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

లాలయ్య సేవలు మరువలేనివి

చిన్నగూడూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన భర్తపురం లాలయ్య గ్రామానికి ఉపసర్పంచ్, 50ఏళ్లుగా గౌడ సొసైటీ అధ్యక్షుడిగా అందించిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం రాత్రి అనారోగ్యంతో లాలయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన లాలయ్య పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. భర్తపురం కొమురెల్లి, నర్సయ్య, ఆయూబ్‌పాషా ఉన్నారు.

బోరుబండ్ల ఓనర్లపై కేసు నమోదు చేయాలి

కొత్తగూడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ, గంగారం మండలాల్లో రెవెన్యూ, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా బోర్లు వేస్తున్న బోరుబండ్లను సీజ్ చేసి బోరు బండ్ల యజమా నులు, ఏజెంట్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసునమోదు చేసి చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల రాము డిమాండ్ చేశారు. కొత్తగూడలో శనివారం నిర్వహించిన సమావేశంలో రాము మా ట్లాడారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సువ ర్ణపాక వెంకటరత్నం, మండల అధ్యక్షుడు పూనెం సందీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లెల సారయ్య, నాయకుడు జగన్నాథం పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

నెల్లికుదురు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అంబేద్కర్‌సెంటర్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ 140 వ ఆవిర్భవ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి కార్యకర్తలు పంపిణీ చేశారు. పెరమాండ్ల గుట్టయ్య, గుగులోత్ బాలజీ నాయక్ జెల్ల వెంకటేష్, జంగా వంశీ, రత్నపురం యాకయ్య, జిలుకర యాలాద్రి, తూళ్ల నరేందర్, భాస్కర్‌నాయక్, సమరం పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత.. ఇద్దరిపై కేసు

గార్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జీవంచిపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రైలు నుంచి దిగుమతి చేసుకున్న నల్ల బెల్లం రెండు క్వింటాళ్ల 40కేజీలతో పాటు ఐదు కేజీల పట్టికను పట్టుకొని ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు గార్ల ఎస్సై ఎస్‌కే. రియాజ్ పాషా తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం మహబూబాబాద్ చెందిన భూక్యా వీరన్న, అంగోతు లింగమూర్తిలు కలిసి ఆంధ్రప్రదేశ్ నెల్లూరు నుండి అక్రమంగా రైలు మార్గం ద్వారా గార్ల తరిలించారు ఇక్కడి నుండి బయటకు తరలించే సమయంలో పోలీసుల కట్టపడి పట్టుబ డ్డారు. పట్టుబడిన బెల్లాన్ని స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో వివిధ దశల్లో నిలిచిపోయిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణా లను పూర్తి చేసి ఇళ్లులేని నిరుపేదలకు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలో నిర్మాణాలు నిలిచిపో యిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను శనివారం సీపీఎం ప్రతినిధి బృందం సందర్శించింది. సమ్మెట రాజమౌళి, రావుల రాజు, వీరేష్ పాల్గొన్నారు.